# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 340 | పేజీలు: 4 | వెల: రూ.4/- | గురువారం 6 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# 152 మీటర్ల ఎత్తుకు ఒప్పించండి



### తుమ్మిడిహెట్టిపై కేంద్రమంత్రి పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

### తెలంగాణ, మహారాష్ట్ర మధ్య భేటీ ఏర్పాటు చేయండి

### సానుకూలంగా స్పందించిన పాటిల్

### కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్‌తోనూ సీఎం భేటీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణం ఎత్తు పెంచడానికి అనుమతించేలా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బరాజ్ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉ ఒడదని పేర్కొన్నారు. కాబట్టి కనీసం 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. ఢిల్లీ పర్యటనకు వచ్చిన సీఎం.. బుధవారం ఉదయం కేంద్రమంత్రిని ఆయన కార్యాలయంలో కలిశారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ఈ ప్రాజెక్టుకు అనుమతుల మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి పీఎంఓ స్పందించి జలవనరుల శాఖకు లేఖ పంపడం తదితర విషయాల గురించి పాటిల్‌కు ముఖ్యమంత్రి వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి గతంలోనే ఉభయ రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే 152 మీటర్ల వరకు ఎత్తుతో బరాజ్ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం చేసిందని, ఆ అధ్యయనం ప్రకారం152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందని చెప్పారు. ఆ ముంపులోనూ 50 శాతం నదీ గర్భంలోనే ఉంటుందని వివరించారు. ఒకవేళ 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే గ్రావిటీ ద్వారా కావల్సినంత నీరు సరఫరా చేయలేమని అన్నారు. ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**పీఎంఓ నుంచి లేఖ వచ్చింది: పాటిల్**

పీఎంఓ నుంచి లేఖ అందిందని ముఖ్యమంత్రికి పాటిల్ చెప్పారు. దీనిపై తొలుత కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి, రాష్ట్రస్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ..మిగతా 2లో



### గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఏపికి

# అనుకూల నిర్ణయాలు

### తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

### 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు

### కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం ..మిగతా 2లో



# లీగల్ నోటీసులకు తగిన సమయంలో జవాబిస్తా

### క్షుద్ర పూజలపై హరీష్ వివరణ ఇవ్వాలి

### నిజామబాద్‌లో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహేశ్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

తమిళనాడు, కర్ణాటకల్లో చేసిన పూజలపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. పూజల వివరాలను మీడియాకు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. తమవద్ద హరీస్ పూజలపై ఆధారాలు ఉన్నాయని అన్నారు. నిజామాబాద్‌లో టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన ..మిగతా 2లో

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్-2026 గ్లోబల్ సమ్మిట్

### సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి

### భారీ పెట్టుబడుల ఆకర్షణకు గ్లోబల్ సమ్మిట్ వేదికగా నిలవాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్?2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే ..మిగతా 2లో

### రేవంత్ విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు

# షరతులతో కూడిన అనుమతి

**హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**



సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్‌పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే ..మిగతా 2లో



### ఇంటర్ కాలేజీలకు

# ఎన్‌వోసి తప్పనిసరి

### ఎన్‌వోసిలను పరిశీలించగా నకిలీవని తేలింది

### వీటిపై విచారణ కొనసాగుతుందన్న బోర్డు సెక్రటరీ

**హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

ఇంటర్మీడియట్ కాలేజీలకు ఎన్‌వోసి కంపల్సరీ చేశామని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డుకు వచ్చిన కొన్ని ఎన్‌వోసి లను హైడ్రాతో సంప్రదించి పరిశీలించగా, కొన్ని సర్టిఫికెట్లు బోగస్‌గా ఉన్నట్లు గుర్తించామన్నారు. హైడ్రాకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇంటర్మీడియట్ బోర్డుకు అందడంతో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఫేక్ ఎన్‌వోసిల వ్యవహారంపై విచారణ కొనసాగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత ఎన్ని నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారనే విషయం స్పష్టమవుతుందని తెలిపారు.నకిలీ ..మిగతా 2లో

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

### నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ

### 8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**



హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఫైర్ ఎన్‌వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ..మిగతా 2లో

# దిగివచ్చిన మెటా.. మోడీకి క్షమాపణలు

### కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం




**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు ..మిగతా 2లో

# 152 మీటర్ల ఎత్తుకు ఒప్పించండి

మొదటి పేజీ తరువాయి...

ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్య కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

**ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వండి**

పాలమూరు--రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను ముఖ్యమంత్రి కోరారు. బుధవారం పార్లమెంట్ భవన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు కేంద్రమంత్రిని కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పాలమూరు ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతలపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్‌పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్ల నిధులను వ్యయం చేసిందని చెప్పారు. అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయి,



ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని వివరించారు.

**ప్రధానిని దూషిస్తే బీజేపీ రాష్ట్రాల్లో ఒక్క కేసైనా పెట్టారా?**

ప్రదానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన దివంగత మాతృమూర్తి హీరాబెన్ మోదీలను సోషల్ మీడియా వేదికగా దూషించిన ఘటనలపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కనీసం ఒక్క కేసైనా నమోదు చేశారా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో తమ ప్రభుత్వం పూర్తిగా చట్ట ప్రకారమే ముందుకు వెళ్తోందన్నారు. సోషల్ మీడియాలో ప్రధానిని, ఆయన తల్లిని దూషిస్తున్నారంటూ హైదరాబాద్‌కు చెందిన బీజేపీ కార్యకర్త చేసిన ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కాగా కేసు నమోదు చేసిన సైబరాబాద్ పోలీసు అధికారిని బదిలీ చేశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో భేటీ తర్వాత సీఎం మీడియాతో పిచ్చాపాటీగా మాట్లాడారు.

పనీపాటా లేనోళ్లు విమర్శలు చేస్తున్నారు..

వచ్చిన ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేశారని రేవంత్ చెప్పారు. 'ప్రధానిపై, ఆయన తల్లిపై అభ్యంతకరమైన వ్యాఖ్యలు చేసిన కేసుకు సంబంధించి డీఎస్పీ బదిలీ వ్యవహారంపై ఢిల్లీలో పనీపాటా లేని కొందరు విమర్శలు చేస్తున్నారు..'అని పరోక్షంగా కిషన్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారుల బదిలీ అనేది ముఖ్యమంత్రికి రాజ్యాంగం కల్పించిన విచక్షణాధికారమని, తన బాధ్యతల్లో అది కూడా ఒకటని పేర్కొన్నారు. బీజేపీ నేతలే వేరేవాళ్లను దారుణంగా తిడుతున్నారని, కాంగ్రెస్ నేతలను, ప్రతిపక్ష పార్టీల నాయకులను, విద్యార్థులను అభ్యంతరకరమైన పదాలతో దూషిస్తున్నారని మండిపడ్డారు.

# గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు

మొదటి పేజీ తరువాయి...

చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జిఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేందప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్దా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్ నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన


ఏడు అనుమతులను రివ్యూ చేస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయపడి కేంద్ర మంత్రులు పెదవులు మూసుకుంటున్నారని, దీనిపై బీజేపీ వెంటనే స్పందించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం చంద్రబాబు బంటు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే జీఆర్ఎంబీ అజెండాలో ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయని, ఒకవేళ కేసీఆర్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్రానికి ఇంత ధైర్యం వచ్చేదా అని ప్రశ్నించారు. ఏపీ మూలాలు ఉన్న అధికారులు తెలంగాణ ఇరిగేషన్ శాఖలో బాధ్యతలు వహిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని ఆరోపించారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండా నుంచి గోదావరి, బనకచర్ల అంశాలను తొలగించాలని, ఈ అజెండాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం రిట్, సూట్ పిటిషన్ల పేరుతో ఏడాది కాలంగా సమయం వృథా చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందాలతో గోదావరి, బనకచర్ల ప్రాజెక్టులకు ఒప్పుకున్నారని ఆరోపించారు. గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధంగా 960 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, రాష్ట్ర హక్కులు కాలరాస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ బొమ్మలాగా కూర్చున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందని హరీశ్ ఆరోపించారు. రాష్ట్రానికి ద్రోహం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. గురు దక్షిణ చెల్లించడం కోసం రేవంత్ మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేతగాని ప్రభుత్వం ఉందని విమర్శించారు. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదని హెచ్చరించారు. కాళేశ్వరం అనుమతులు రద్దు చేయడమంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమే అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని మాజీ మంత్రి విమర్శించారు. గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదన్నారు. తెచ్చిన అనుమతులు కూడా ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతి ఇవ్వొద్దని ఏపీ చెబితే ఉఖీఓఃలో పెట్టారని మండిపడ్డారు. బనకచర్ల, మల్లన్నసాగర్ కడతారు కానీ.. సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దని హరీశ్ రావు ప్రశ్నించారు.

# దిగివచ్చిన మెటా.. మోడీకి క్షమాపణలు

మొదటి పేజీ తరువాయి...

అంగీకరించింది. అంతే కాకుండా తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీకి క్షమాపణలు చెప్పింది.

ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించిన వ్యవహారం మెటాకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడంతో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. అలాగే కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కూడా మెటా బృందం కలిసింది. జూలై 23న ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన వీడియోను ఫేస్‌బుక్ కొంతసేపు పరిమితం చేసింది. అనంతరం అది సాంకేతిక లోపం వల్ల జరిగిందని మెటా వివరణ ఇచ్చి పోస్టును పునరుద్ధరించింది. అయితే ఈ వివరణను కేంద్ర ప్రభుత్వం సరిపోదని స్పష్టం చేసింది. సమావేశంలో ప్రధాని పోస్టు వ్యవహారంతో పాటు ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు, కృత్రిమ మేధతో రూపొందించిన తప్పుడు సమాచార నియంత్రణ వంటి అంశాలపై కూడా కేంద్రం ప్రశ్నలు సంధించింది. ప్రముఖ వ్యక్తుల ధృవీకరించిన ఖాతాల్లోని పోస్టులను తొలగించే ముందు మరింత భద్రతా వ్యవస్థ ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. మెటా అల్గోరిథమ్ ఎలా పనిచేస్తోంది?



పోస్టులు ఏ ప్రాతిపదికన తొలగించబడుతున్నాయి? భారత చట్టాలకు అనుగుణంగా వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? వంటి అంశాలపై కూడా ప్రభుత్వం వివరణ కోరింది. దేశ భద్రత, ప్రజా శాంతి వంటి అంశాలకు సంబంధించిన విషయాల్లో సోషల్ మీడియా వేదికలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ వీడియో తొలగింపును తీవ్రంగా పరిగణించిన పార్లమెంటరీ స్థాయి సంఘం మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. నిర్దేశిత గడువులో స్పందించకపోతే భారతదేశంలో మెటాకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' రక్షణను పునఃపరిశీలించే అవకాశం ఉందని హెచ్చరించింది. సోషల్ మీడియా సంస్థలు భారత చట్టాలను పూర్తిగా పాటించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మెటా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

మొదటి పేజీ తరువాయి...

ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అ÷-జబెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు. ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



# లీగల్ నోటీసులకు తగిన సమయంలో జవాబిస్తా

మొదటి పేజీ తరువాయి...

బోనాల వేడుకలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. 'పక్క రాష్ట్రాల్లో చేసిన పూజలపై హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలన్నారు. రాష్ట్రానికి మంచి జరగాలని కోరుకోకుండా క్షుద్ర పూజలు చేయడం శ్రేయస్కరం కాదు. నాకు ఇచ్చిన లీగల్ నోటీసులపై సరైన సమయంలో సమాధానం చెబుతానని, దీనికి భయపడే ప్రసక్తి లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి దృష్ట్యానే దీనిపై మాట్లాడుతున్నాం. నాకు ఎవరిపైనా వ్యక్తిగత కక్ష లేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలోని బోనాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు బోనాల పండగ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ, మేయర్ ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, డీసీసీ ప్రెసిడెంట్‌నగేశ్ రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, శేఖర్ గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్-2026 గ్లోబల్ సమ్మిట్

మొదటి పేజీ తరువాయి...

లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ కాలేజీలకు ఎన్‌వోసి తప్పనిసరి

మొదటి పేజీ తరువాయి...

ఎన్‌వోసిల విషయంలో హైడ్రా, ఇంటర్మీడియట్ బోర్డు సీరియస్‌గా ఉన్నాయని అభిలాష అభినవ్ వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇంటర్మీడియట్ బోర్డు స్థాయిలో అంతర్గత విచారణ కూడా చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫేక్ ఎన్‌వోసి ల వ్యవహారంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అభిలాష అభినవ్ తెలిపారు. కాలేజీల అనుమతులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు ఏవైనా సందేహాలు ఉంటే వెబ్‌సైట్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చని సూచించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 3 వేలకుపైగా ఇంటర్మీడియట్ కాలేజీలు అనుమతులు పొందినట్లు ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు.

# రేవంత్ విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు షరతులతో కూడిన అనుమతి

మొదటి పేజీ తరువాయి...

లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్‌పోర్టులను తాత్కాలిక కస్టడీకి ఇవ్వడంతో పాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానని అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారికి లేఖ రాసి పాస్‌పోర్టులను తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

## సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాంకాళీ అమ్మవారి దేవాలయంలో

# కురుమల ఆధ్వర్యంలో బోనాల సమర్పణ



సికింద్రాబాద్ ఉజ్జయిని మహాంకాళి అమ్మ వారిని దర్శించుకున్న కురుమ సంఘం నాయకులు



బోనాల వేడుకలలో పాల్గొన్న కురుమ సంఘం నాయకులు

**బుద్వేల్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం) :**

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాంకాళీ అమ్మవారిని బుధవారం కురుమ సంఘం నాయకులు దర్శించుకుని పూజలు చేశారు. భోలక్పూర్ బీరప్ప దేవాలయం నుంచి మల్లన్న దేవాలయం, బన్సీలాల్ పేట్, సుబాష్ రోడ్డు, కురుమ బస్తీ, పెద్దమ్మ దేవాలయాల నుంచి జై మహాంకాళీ నామ స్మరణతో మారుమోగాయి. కురుమలు వందల సంవత్సరాలుగా మహాంకాళీ అమ్మవారికి బోనాలు చేస్తుండటం సాంప్రదాయంగా వస్తుందని తెలిపారు. కురుమల కుల దైవాలైన అక్క మహాంకాళీ, బీరప్ప, మల్లన్న దేవతలకు రాష్ట్ర వ్యాప్తంగా బోనాలు చేస్తుంటామని కురుమ సంఘం నాయకులు గుర్తు చేశారు. సికింద్రాబాద్ లో బుధవారం జరిగిన బోనాల వేడుకలు భక్తీ శ్రద్ధలతో నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో గొర్రెలు, మేకల కార్పోరేషన్ చైర్మన్ సరిత, తిరుపతయ్య, బీజేపీ సీనియర్ నాయకులు చీర సత్యనారాయణ, మహాంకాళీ దేవాలయ కమిటీ సభ్యులు సోనాలి సునీల్, కురుమ మందారం, క్రిష్ణ, హెచ్చీకేఎస్ కొల్లంపల్లి శ్రీనివాస్, హెచ్చీకేఎస్ వ్యవస్థాపకులు కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్, నటరాజ్, కొంగళ్ల పాండు, వన్నాడి రమేశ్, సునీల్, జిత్రం శ్రీను, ఉప్పల్ శ్రీను, వేణుగోపాల్, రిషి, దినేశ్, శివ తో పాటు కురుమ కులస్థులు పాల్గొన్నారు.



ఎంఎం పహాడీ లో షియా ముస్లిం ల మాతం ర్యాలీ. బందోబస్తులో పాల్గొన్న రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య లు

## షియా ముస్లీంల ఆధ్వర్యంలో ఖయ్యూంనగర్‌లో మాతం ర్యాలీ

బుద్వేల్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం) 40 రోజుల పాటు షియా ముస్లీం లు నిర్వహించే మొహరం సంతాప దినాల అనంతరం బుధవారం షియా ముస్లీంలు చిన్నారుల ఆధ్వర్యంలో మాతం కార్యక్రమం నిర్వహించారు. ఖయ్యుంనగర్ నుంచి ఎం ఎం పహడీ వరకు ఈ మాతం ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమ ంలో రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య లు పాల్గొని తమ సిబ్బంది తో బందోబస్తు ను పర్యవేక్షించారు. షియా కమ్యూనిటీ కి చెందిన సయ్యద్ రిజ్వాన్ హుస్సేన్ అబేది, మజ్లిస్ కు చెందిన మీర్జా రియాజ్ హుస్సేన్ అపంది. నవాజుద్దీన్ లు పాల్గొన్నారు.






# జూరాల వద్ద కృష్ణమ్మ పరవళ్లు.

## 33 గేట్లు ఎత్తివేత

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5(నమస్తే ఉదయం)**

కర్ణాటక జలాశయాల నుండి కృష్ణానదీలోకి భారీగా వద్ద ప్రవాహం వస్తుండటంతో జూరాల వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. బుధవారం సాయంత్రానికి జూరాల జలాశయానికి 2,45,000 క్యూసెక్కులు ఇన్ ఫ్లో నమోదు కాగ అవుట్ ఫ్లో లో 2,48,791 క్యూసెక్కులుగా నమోదయింది. ఎగువ ఉన్న నారాయణపూర్ డ్యాం నుంచి జూరాల ప్రాజెక్టుకు దాదాపు 2.50 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో ప్రాజెక్టు 33 గేట్లు ఎత్తివేసి 2,18,790 క్యూసెక్కుల వరద నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టులోకి వదులుతున్నారు. కర్ణాటక నుండి వస్తున్న వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశాలున్నాయని జూరాల అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాల్లో కృష్ణానది పరవళ్లు తొక్కుతూ నిండుకుండలా ప్రవహిస్తుంది. అదేవిధంగా ఇటిక్యాల మండలం బీచుపల్లి దగ్గర సైతం కృష్ణానది నిండుకుండలా ప్రవహిస్తూ శ్రీశైలం జలాశయాని కి పరుగులు పెడుతోంది. జూరాల ప్రాజెక్టు పై ఆధారపడిన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాలతో పాటు కుడి, ఎడమ సమాంతర కాలువకు సాగునీటిని వదులుతున్నారు. బుధవారం సాయంత్రానికి జూరాల జలాశయంలో 317.490 మీటర్ల స్థాయిలో 7.426 టీఎంసీల నీటి నిలువలను ఉంచుకొని దిగువకు నీటిని వదులుతున్నారు. దీంతో పాటు విద్యుత్ ఉత్పత్తికి 26,208, నెట్టెంపాడు లిఫ్ట్ కు 437, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 630, భీమలిఫ్ట్ కు 1300 క్యూసెక్కులు, కుడి కాలువకు 600, ఎడమ కాలువకు 1030, సమాంతర కాలువకు 600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.

## కోడి మాంసం వండాలన్నందుకు కూరగాయలు కోసే కత్తితో స్నేహితుని గొంతు కోసిన యువకుడు

**బుద్వేల్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**



గాయపడ్డ మిట్టు బాబు

తరచు సూటిపోటి మాటలతో వేదిస్తుండటంతో ఓ యువకుడు తన రూమ్ లోని మరో యువకుని గొంతును కత్తితో బలంగా కోసాడు. గాయపడ్డ యువకుడు ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య ఉ న్నాడు. వివరాలను రాజేంద్రనగర్ ఎస్ఐ రాఘవేందర్ వెల్లడించారు. కిస్మత్పూర్ దర్గా ఖలీజాన్ ప్రాంతానికి చెందిన మిట్టు బాబు (38) సెంట్రింగ్ మేస్త్రీగా పనిచేస్తాడు. బీహార్ కు చెందిన గుడ్డు రాజు తో పాటు మరో యువకుని తో కలసి దర్గాఖలీజ్ ఖాన్ లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ముగ్గురు సెంట్రింగ్ పనులు చేస్తు జీవనం సాగిస్తున్నారు. మిట్టు బాబు స్థానికుడు కావడంతో తనతో పాటు అద్దె గదిలో ఉంటున్న వారిపై పెత్తనం చెలాయించేవాడు. మం గళవారం రాత్రి ముగ్గురు మద్యం సేవించారు. ఆ తర్వాత మిట్టు బాబు చికెన్ తీసుకువచ్చాడు. వం డాలని గుడ్డు రాజు ను కోరాడు. దీంతో ఇరువురి మధ్య వివాధం చెలరేగింది. ఈ గొడవ లో కూరగాయలు కోసే కత్తితో గుడ్డు రాజు మిట్టు బాబు గొంతు కోశాడు. గమనించిన మరో యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. గాయపడ్డ మిట్టు బాబు పెద్ద పెద్ద గా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా బాబు రక్తం మడుగులో పడిఉండటం గమనించారు. స్థానికులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డ మిట్టు బాబు ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దాడి చేసిన గుడ్డు రాజు (36) ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. గాయపడి ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న మిట్టు బాబు సోదరుడు సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ ఎస్ఐ రాఘవేందర్ దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యవసాయ వర్శిటీలో నేడు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

**బుద్వేల్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం) :**



ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సారు

ఈ నెల 6వ తేదీన రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి ఉత్సవాలను నిర్వహించడానికి వర్శిటీ వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. వర్శిటీ ఆడిటోరియంలో మద్యాహ్నం 2:30 గంటల నుంచి ఈ ఉ త్సవాలు ప్రారంభం కానున్నాయన్నారు. తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరు కానున్నారన్నారు. తెలంగాణ విధ్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్ విశ్వేశ్వర్ రావు ప్రొఫెసర్ జయశంకర్ స్మారకోపన్యాసం ఇవ్వనున్నారు. ప్రత్యేక అతిదులుగా ఏంపీ ఈటెల రాజేందర్, ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి లు హాజరౌతారన్నారు. రాజేం ద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ అధ్యక్షతన ఈ ఉత్సవాలు జరుగనున్నాయన్నారు.




రాజేంద్రనగర్ లోని డిజిటల్ అగ్రికల్చరల్ టెక్నాలజీ సెంటర్

## తాజా పంటల విస్తీర్ణంపై పీజేటీఏయు నివేదిక

**గతేడాది తో పోలిస్తే 10శాతం అధిక విస్తీర్ణంలో పంటలు**

**ఎల్ నీ నో ప్రభావం నుంచి రైతులకు కొంత ఉప శమనం**

**బుద్వేల్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లో గత ఏడాది స్థాపించిన సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చరల్ అండ్ టెక్నాలజీ లోని రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ వ్యవస్థ సేకరించిన ఉప గ్రహ చాయ చిత్రాల విశ్లేషణ ద్వారా వచ్చిన తాజా పంటల విసీ ర్ణం వివరాలను వ్యవసాయ వర్శిటీ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య బుధవారం విడుదల చేశారు. 2026 జూలై 29 వరకు తెలంగాణ లో సాధారణ పంటల విస్తీర్ణం సుమారు 98,13 లక్షల ఎకరాలు కాగా, అందులో సుమారు 33 లక్షల ఎకరాల విస్తీర్ణంలో 34 శాతం ఇప్పటికే వివిధ పంటల విత నాలు నాటారని ఆయన తెలిపారు. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 10శాతం అధికమని ప్రొఫెసర్ జానయ్య పేర్కొన్నారు. అత్యధిక విస్తీర్ణంలో పంటలు విత్తిన జిల్లాలలో యాదాద్రి భువనగిరి 57 శాతం, మేడ్చల్ మల్కాజిగిరి 54శాతం, జనగామ 51శాతం తో తొలి మూడు స్థానాలలో ఉన్నాయన్నారు. అదే విదంగా అతి తక్కువ విస్తీర్ణంలో విత్తనాలు నాటిన జిల్లాలలో ఖమ్మం 16.5శాతం. వనపర్తి 17.3శాతం, వరంగల్ 20.1 శాతం చివరి మూడు స్థానాలలో ఉన్నాయన్నారు. పంటల వారి వివరాలు పరిశీలించినట్లయితే గత ఏడాది వలే ఈ ఏడాది కూడా వరి, పత్తి, మొక్క జొన్న పంటలు సాగు విస్తీర్ణంలో సింహ భాగం ఆక్రమించాయని ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. పప్పుధాన్యాలు, నూనె గింజల విస్తీర్ణంలో గత సంవత్సరంతో పోలిస్తే కొంత పెరుగుదల కనిపించిందని, ప్రభుత్వం చేపట్టిన పంటల మార్పిడి అవగాహన కార్యక్రమాల ఫలితమే ఈ పెరుగుదల కు కారణమని ప్రొఫెసర్ జానయ్య వివరించారు.

# తెలంగాణ దిక్సూచి జయశంకర్

ఆధిపత్యశక్తులపై అతడు వీరభద్రుడు, ఆలోచనల అవసరాన్ని తెలిపిన నిబద్ధుడు, తెలంగాణ కనుగొన్న అతడు మరో బుద్ధుడు, అతడే ఆచార్య కొత్తపల్లి జయశంకర్ , తెలంగాణను స్వప్నించి, శాసించిన మహోపాధ్యుడు జయశంకర్ సార్ వరంగల్ జిల్లా, ఆత్మకూరు మండలం అక్కన్నపేట గ్రామంలో లక్ష్మీ కాంతారావు, మహాలక్ష్మి దంపతులకు 1934 ఆగస్టు 6న జన్మించాడు. హనుమకొండ లోని మార్కజీ పాఠశాలలో ప్రాథమిక విద్య నేర్చాడు. హనుమకొండ న్యూ హైస్కూల్లో మాధ్యమిక వరకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్. ఎస్. సీ వరకు చదువుకున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని బి.ఏ పూర్తి చేశాడు. బెనారస్ విశ్వవిద్యాలయం, అలీగడ్ విశ్వవిద్యాలయం నుండి పి.జి పూర్తి చేశాడు. జయశంకర్ సమస్యల పట్ల ఏ విధంగా స్పందించాలో, కానీ ఏ విధంగా ఉద్యమంగా తీర్చిదిద్దాలో నిరూపించే సంఘటన ఒకటి ఈయన విద్యాభ్యాస కాలంలో జరిగింది. అప్పట్లో వరంగల్ లో డిగ్రీ కళాశాల లేదు. డిగ్రీ చదవాలంటే హైదరాబాదుకు వెళ్లాలి. లెక్చరర్స్ ప్రొద్దు బలంతో డిగ్రీ కాలేజీ కావాలని విద్యార్థులు ఉద్యమించారు. అందులో మొదటి వరుసలో జయశంకర్ ఉన్నాడు. ఈ సంఘటన తర్వాత పదేళ్లకు డిగ్రీ కాలేజీ, 30 ఏళ్లకు యూనివర్సిటీ వచ్చింది. ఏదైతే డిగ్రీ కాలేజీ యూనివర్సిటీ కోసం ఉద్యమం చేసిండో అదే యూనివర్సిటీకి ఆచార్య జయశంకర్ వైస్ ఛాన్సలర్ అయ్యాడు. 1960లో ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టడం ద్వారా ఉద్యోగ జీవితం మొదలైంది. హనుమకొండలో ఉ పాధ్యాయుడిగా నియామకమై, లెక్చరర్ గా ఆదిలాబాద్ కు పోయాడు. 1975-79 వరకు సీ కె ఎం కళాశాల ప్రిన్సిపల్ గా, బోర్డు మెంబర్ సేవలందించాడు. 1982-91 వరకు సీఫేల్ రిజిస్ట్రర్ గా పని చేశాడు. 1991-94 వరకు కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ గా పనిచేశాడు. ఇవే కాక వివిధ ప్రభుత్వం ఉద్యోగాల్లో సంఘాల పదవుల్లో పనిచేసి తనదైన ముద్ర వేశాడు. ఇన్ని పదవుల్లో పనిచేసి




నాకు సీ. కె ఎం. కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేయడం ఎక్కువ తృప్తినిచ్చింది అని స్వయంగా అన్నాడు. మూడు దశలుగా సాగిన తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ కీలక పాత్ర పోషించాడు. 1952 లో ఇంటర్మీడియట్ విద్యార్థిగా తెలంగాణకు జై కొట్టి తరగతులను బహిష్కరించాడు. వరంగల్లో మొదలైన ఉద్యమం హైదరాబాద్ కేంద్రీకృతమైంది. 1969 ప్రత్యేక తెలంగాణ ఉ ద్యమంలో పాల్గొని తెలంగాణ సాధనకు ఎలాంటి వ్యూహాలు రచించారు జయశంకర్ కు తెలుసు. తెలంగాణ ఉ ద్యమానికి మూడు దశలు ఉన్నాయి. మొదటిది భావజాల వ్యాప్తి.అది జరిగింది.రెండవది ఆందోళన కార్యక్రమం. అది కొనసాగుతున్నది. ఇక మిగిలింది రాజకీయ ప్రక్రియ అది జరగాల్సి ఉంది. దానిని పూర్తి చేయడమే ఉద్యమ కర్తవ్యం కావాలి. దానికి రాజకీయ చిత్తశుద్ధి అవసరము ఇప్పుడున్న రాజకీయ నాయకత్వం ఆ పని పూర్తి చేస్తుందని అని నేను నమ్ముతున్నాను, అని అన్నాడు. మూడు దశలో కూడా జయశంకర్ మాత్రం మరువలేనిది. అందుకే అతడు తెలంగాణ సిద్ధాంతకర్త. మొదటిది తెలంగాణ భావజాల వ్యాప్తి. అది ప్రజలలో చొచ్చుక పోయిందో జయశంకర్ ఒక రోజు ఇట్లు చెప్పిండు. "ఎందుకమ్మా తెలంగాణ అంటే? సార్ తెలంగాణ వస్తే మా పొలాలకు నీళ్లు వస్తాయి, మా పోరగాళ్ళు కొలువులు వస్తాయి. అనే భావన వారికి కలిగింది " చదువురాని ఆడవాళ్లు చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకున్నాడు. జయశంకర్ విద్యార్థి, సంఘ నాయకుడు గొప్ప పరిపాలనాదక్షుడు. తెలంగాణ కోసం అహర్నిశలు శ్రమించిన కార్యశురుడు. తెలంగాణ కోసం తెలంగాణ రాజకీయ నాయకులకు తన సహకారం అందించాడు. చెన్న రెడ్డి నుండి చంద్రశేఖర్ రావు వరకు ప్రతి ఒక్కరి రాజకీయ పార్టీకి తన మేదో శ్రమను ధరపోశాడు. అయన ఆశిన్నట్లే చివరగా రాజకీయ ప్రకీయతో నే తెలంగాణ వచ్చింది. అందరిని తన మార్గంలో నడిపించాడు. అందుకే అతడు మార్గదర్శి. తెలంగాణకు చిరునామా, తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్.

**ఆగస్టు 6 ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా..**

**రచయిత**

**దేవులపల్లి రమేశ్**

**నంగునూర్, సిద్దిపేట,**

**9963701294**



# ఎస్ఐఆర్‌కు కేవలం ఐదు రోజులే గడువు

### ఆగస్టు 10లోపు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించి ఓటరు జాబితాలో పేరు నమోదును నిర్ధారించుకోండి

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,ఆగస్టు5(నమస్తే ఉదయం)**

ఎస్ఐఆర్ కార్యక్రమానికి ఆగస్టు 10తో గడువు ముగియనుంది.ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు వెంటనే సంబంధిత బి ఎల్ ఓ లకు ఫారాలు అందజేయాలి- ఓటరు జాబితాలోని పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలి.జిల్లా వ్యాప్తంగా ఈ ఆర్ ఓ, ఏ ఈ ఆర్ ఓ లు, బి ఎల్ ఓ లు ప్రజలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించాలి.భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమానికి కేవలం ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందని, జిల్లాలోని అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆగస్టు 10వ తేదీలోపు తమ ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బి ఎల్ ఓ లు) తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, తప్పులులేకుండా రూపొందించేందుకు ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు భాగస్వామి కావాల్సిన అవసరం ఉందని, ఎన్నికల సంఘం కల్పించిన అదనపు గడువును ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే తమ పరిధిలోని బూత్ లెవల్ అధికారిని (బి ఎల్ ఓ) సంప్రదించి పూర్తి వివరాలతో ఫారాలను సమర్పించాలని తెలిపారు. అసంపూర్ణంగా లేదా తప్పుగా నింపిన ఫారాల వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, అవసరమైన అన్ని వివరాలను స్పష్టంగా నమోదు చేసి సమర్పించాలని సూచించారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు కూడా తమ వివరాలను ఒకసారి తప్పనిసరిగా పరిశీలించుకోవాలని తెలిపారు. పేరు, ఇంటి చిరునామా, వయస్సు, లింగం, కుటుంబ వివరాలు లేదా ఇతర సమాచారంలో ఏవైనా తప్పులు ఉంటే వాటిని గడువులోపు సరిదిద్దించుకోవాలని సూచించారు. అవసరమైతే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి (ఈ ఆర్ ఓ), సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏ ఈ ఆర్ ఓ ) లేదా బూత్ లెవల్ అధికారిని సంప్రదించి సవరణలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రజలకు అవసరమైన మార్గదర్శకాలు, సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ఎన్నికల నమోదు అధికారులు (ఈ ఆర్ ఓ లు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏ ఈ ఆర్ వో లు), బూత్ లెవల్ అధికారులు (బి ఎల్ ఓ లు) కార్యాలయ వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫారాల స్వీకరణ, సందేహాల నివృత్తి, సవరణల ప్రక్రియలో సహకరిస్తున్నారని తెలిపారు. ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకుండా భారత ఎన్నికల సంఘం జారీ చేసిన అధికారిక మార్గదర్శకాలను మాత్రమే అనుసరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గడువు ముగిసే వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించడం ద్వారా చివరి నిమిషంలో రద్దీని నివారించవచ్చని చెప్పారు.

"ఎస్ఐఆర్ కార్యక్రమానికి కేవలం ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకం. ప్రతి ఓటరు తన వివరాలను ఒకసారి పరిశీలించి, అవసరమైతే సవరణలు చేయించుకోవడంతో పాటు ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు ఆగస్టు 10వ తేదీలోపు తప్పనిసరిగా సమర్పించాలి. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలి."" అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా ప్రజలకు సూచించారు.

– కార్యక్రమం: ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్)

– గడువు: 10 ఆగస్టు 2026– ఎవరికి: జిల్లాలోని అర్హులైన ఓటర్లందరికీ– చేయాల్సింది: ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించడం, ఓటరు వివరాలు పరిశీలించడం, అవసరమైన సవరణలు చేయించుకోవడం

– సంప్రదించవలసిన వారు: బి ఎల్ ఓలు, ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ వో లు

– విజ్ఞప్తి: చివరి రోజు వరకు వేచి ఉండకుండా వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలి.



## గట్టు- గద్వాల ప్రధాన రహదారిపై వెహికల్ అండర్‌పాస్ నిర్మించాలని

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి పాలమూరు ఎంపీ డికె. అరుణ వినతి

### సానుకూలంగా స్పందించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5(నమస్తే ఉదయం)**

గట్టు- గద్వాల ప్రధాన రహదారిపై వెహికల్ అండర్‌పాస్ నిర్మించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి పాలమూరు ఎంపీ డికె. అరుణ వినతి పత్రం అందజేశారు.బుధవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో జరిగిన భేటీలో జోగులాంబ గద్వాల జిల్లా గట్టు- రాయపురం పరిసర గ్రామాల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకువెళ్ళిన ఎంపీ డీకే అరుణ. వెహికిల్ అండర్ పాస్ నిర్మాణ అవశ్యకతను వివరించారు.జోగులాంబ గద్వాల జిల్లాలో సోలాపూర్–కర్నూలు–చెన్నై గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో గట్టు, రాయపురం , చుట్టుపక్కల గ్రామల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను పరిష్కరించాలని డికె. అరుణ కోరారు. జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్మిస్తున్న ఆరు లేన్‌లో సోలాపూర్–కర్నూలు–చెన్నై గ్రీన్‌ఫీల్డ్ హైవే ద్వారా ప్రస్తుతం ఉన్న గట్టు – కేటీ దొడ్డి ఉ గద్వాల జిల్లా ప్రధాన రహదారిని కిలోమీటర్ 214o100 వద్ద దాటుకుంటూ వెళ్తోంది. గట్టు–గద్వాల రోడ్డు ఈ ప్రాంత ప్రజలకు అత్యంత కీలకమైన రవాణా,ప్రయాణ మార్గమని, ప్రధాన రహదారి అయిన గట్టు–గద్వాల రోడ్డుపై వెహికల్ అండర్‌పాస్ నిర్మించాల్సి ఉండగా, కేవలం ఒక సాధారణ విలేజ్ రోడ్డు (గ్రామీణ రహదారి) పై మాత్రమే అండర్‌పాస్ నిర్మించి, ప్రధాన రహదారిని మూసివేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రోడ్డును మూసివేయడం వల్ల భారీ వాహనాలు, ఇతర ట్రాఫిక్ దాదాపు 200 మీటర్ల దూరంలో ఉన్న చిన్న గ్రామీణ రహదారి గుండా వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల స్థానిక ప్రజలు, వందలాది మంది రైతులు తమ పొలాలకు వెళ్లడానికి అదనంగా 300 మీటర్లకు పైగా కాలినడకన ప్రయాణించాల్సి వస్తోందని కేంద్ర మంత్రికి వివరించారు.రాయపురం ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రధాన రహదారి పై వెహికిల్ అండర్ పాస్ నిర్మాణం కోసం ఎంపీ డీకే అరుణ ఇచ్చిన వినతికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

## తారు రోడ్డుపై బురద మట్టి... జారీ పడితే అంతే సంగతి!

### చింతలకుంట -- మాచర్ల రహదారిపై ప్రమాదకరంగా మారిన మలుపు

**కేటీదొడ్డి , ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**



మండలంలోని చింతలకుంట గ్రామం నుండి మాచర్ల వెళ్లే ప్రధాన రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. మార్గమధ్యలోని ఒక మూల మలుపు వద్ద ఇటుకల బట్టీ యజమాని ఇటుకల తయారీ కోసం ట్రాక్టర్లతో బంకమట్టిని తోలించారు. ఈ క్రమంలో తారు రోడ్డుపై పెద్ద ఎత్తున మట్టి పడిపోయింది.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ మట్టి కాస్తా మురికిగా, తీవ్రమైన జారుడు బురదగా మారింది. మలుపు వద్ద రోడ్డు కనిపించక, బైక్‌లు మరియు ఇతర వాహనాలు స్కిడ్ అయి ప్రమాదాల బారిన పడుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. మూల మలుపు వద్దే బురద ఉండటంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై ఉన్న బురద మట్టిని తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

## నీలిపల్లి గ్రామం వరకు ఆర్టీసి బస్సును కొనసాగించాలి



మల్దకల్ మండలం నీలిపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో బుధవారం చెర్లగార్లపాడు స్టేజ్ వద్ద విద్యార్థులు, గ్రామస్తులు రోడెక్కి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీలిపల్లి గ్రామం నుంచి ప్రతి రోజు 50 మంది విద్యార్థులు గద్వాల్, మల్దకల్ మరియు ఇతర ప్రాంతాలకు చదువు కోసం వెళ్తుంటారు అని ఆర్టీసి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మ చెర్లగార్లపాడు గ్రామం వరకు వచ్చే ఆర్టీసీబబస్సును నీలిపల్లి గ్రామం వరకు కొనసాగించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. గతంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను ఆర్టీసీ అధికారులకు విన్నవించగా రేపు పంపిస్తాం ఎల్లుండి పంపిస్తాం అని నిర్లక్ష్యం చేస్తున్నారు కాని ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించలేదన్నారు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

# చిన్నారుల భవిష్యత్తుకు చట్టపరమైన రక్షణ అవసరం






**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు5(నమస్తే ఉదయం)**

జాతీయ న్యాయ సేవా సంస్థ అమలు చేస్తున్న చిన్నారుల సంక్షేమం మరియు రక్షణకు సంబంధించిన పథకాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లా న్యాయ సేవా సంస్థ, జోగులాంబ గద్వాల ఆధ్వర్యంలో నేడు ఎం.జే.పి.టి.బి.సి.డబ్ల్యూ.ఆర్.ఈ.ఐ.ఎస్. (బాలుర) విద్యాలయం, కేటీదొడ్డి మండలంలో ప్రత్యేక న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి. రాజేందర్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఆయన చిన్నారులకు చట్టం కల్పించిన హక్కులు, నల్సా ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం, పోక్సో చట్టం--2012 , బాల్య వివాహాల నిషేధ చట్టం--2006, బాల కార్మిక (నిషేధం , నియంత్రణ) చట్టం, విద్యా హక్కు చట్టం--2009 , జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ మరియు రక్షణ) చట్టం--2015, సైబర్ భద్రతతో పాటు చిన్నారుల రక్షణకు సంబంధించిన ఇతర చట్టాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చిన్నారులు ఎలాంటి వేధింపులు, దుర్వినియోగం లేదా హింసకు గురైన వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించాలని, అలాగే ఉచిత న్యాయ సహాయం అవసరమైన ప్రతి ఒక్కరూ నల్సా టోల్ ఫ్రీ నంబర్ -- 15100కు కాల్ చేసి న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.ప్రతి చిన్నారికి సురక్షితమైన వాతావరణంలో జీవించే హక్కు, విద్యను అభ్యసించే హక్కు, హింస , దుర్వినియోగం నుండి రక్షణ పొందే హక్కును భారత రాజ్యాంగం వివిధ బాలల సంక్షేమ చట్టాలు కల్పించాయని వివరించారు. విద్యార్థులు సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సునంద, జిల్లా బాలల పరిరక్షణ అధికారి నరసింహ, పాఠశాల ప్రిన్సిపాల్ శ శ్రీనివాస్ రావు, చైల్డ్‌లైన్ ప్రతినిధులు సురేష్ మరియు జయన్న, ఎం. వి. ఫౌండేషన్ హనిమిరెడ్డి, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.



## బాలసభలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5(నమస్తే ఉదయం)**


ధరూర్ మండలం వామన్ పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం 'బాల సభ' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పర్ణిక రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... బాలల కోసం బాలలే నిర్వహించుకునే బాలసభలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తాయని అన్నారు. పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో రాణించాలని సూచించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శిరీష, ప్రధానోపాధ్యాయులు ముస్తాక్, పంచాయతీ సెక్రటరీ కృష్ణవేణి, అంగన్ వాడీ ఉపాధ్యాయురాలు శోభ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ఐడిఏ బొల్లారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పోలీసుల అవగాహన కార్యక్రమం

**పటాన్ చెరు, ఆగస్టు 5 ( నమస్తే ఉదయం):**

జాగృతి దివస్ పురస్కరించుకుని బొల్లారం పోలీసులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలు, వాటి నుంచి రక్షణ పొందే మార్గాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస కాకూడదని, అపరిచితులు పంపే ఎపికె ఫైళ్లు, అనుమానాస్పద లింకులు, క్యూఆర్ కోడ్‌లు క్లిక్ చేయకూడదని సూచించారు. ఇలాంటి చర్యల వల్ల మొబైల్ ఫోన్లు హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. అలాగే ఓటిపి, యుపిఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పకూడదని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, నకిలీ ఉద్యోగాలు, స్కాలర్‌షిప్‌లు, లాటరీలు, పెట్టుబడులు, గేమింగ్ రివార్డుల పేరుతో జరిగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీఐ సుధీర్ కుమార్, ఎస్సై అక్షిత, ఎస్సై కిష్టా రెడ్డి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు డిజిటల్ సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించి, అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చని పోలీసులు తెలిపారు.



## జిల్లా కేంద్రంలో ఆక్రమణల తొలగింపు పనుల ప్రక్రియ ప్రారంభం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

గద్వాల పట్టణంలో రహదారులపై ఆక్రమణల తొలగింపు ముమ్మరంగా సాగుతున్నది. ఆపరేషన్ రోప్‌లో భాగంగా బుధవారం కృష్ణవేణి చౌరస్తా నుంచి పాతబస్టాండ్ వరకు ఫుట్‌పాత్‌లపై, రహదారులకు ఇరువైపుల వెలసిన దుకాణాలు, తోపుడు బండ్లను అధికారులు తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా క్రిష్ణవేణి సర్కిల్ పరిధిలోని రహదారికి ఇరువైపుల ఆక్రమణలను గద్వాల మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. విడుతల వారిగా ఆక్రమణ తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం, ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసు విభాగాల బందోబస్తుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.